# వరంగల్ వాయిస్

www.warangalvoice.net

Evening Daily

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 200 శుక్రవారం | 09 ఫిబ్రవరి 2024 | పేజీలు : 09 | వెల రూ. 5


## కలిసికట్టుగా పనిచేద్దాం..



8లో..

- మేడారం జాతరను విజయవంతం చేద్దాం
- మహిళలకు ప్రత్యేక సదుపాయాలు
- అందుబాటులో 4వేల పారిశుధ్య సిబ్బంది
- పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క

## కిడ్నాప్.. కిడ్నాప్..

వివరాలు 2లో..





### నగరంలో పుకార్లు షికార్లు

- ముఠాలు సంచరిస్తున్నా యంటూ ప్రచారం
- భయభ్రాంతులకు గురవుతున్న పేరెంట్స్
- తల్లిదండ్రులకు అవేర్ నెస్ కల్పించాలంటూ డీఈఓ కార్యాలయం నుంచి ఆదేశాలు
- కొత్త వ్యక్తులు కనిపిస్తే ఫిర్యాదు చేయాలంటూ సూచన

రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థుల కిడ్నాప్ వార్తలు నగరంలో కలకలం సృష్టిస్తున్నాయి. ఏ ప్రాంతానికి వెళ్లినా కిడ్నాప్ వార్తలే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఏనోట విన్నా ఫలానా ప్రాంతంలో విద్యార్థులను కిడ్నాప్ చేశారంటూ చెప్పుకొంటున్నారు. ఇందుకుగాను ఒక ముఠా నగరంలో సంచరిస్తున్నారంటూ ప్రచారం సాగుతోంది. నిత్యం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ వార్తలు స్థానికంగా సంచలనం సృష్టిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది. పిల్లలను పాఠశాలలకు పంపేందుకే జంకుతున్నారు. అయితే విద్యార్థులపట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పదంగా పాఠశాల పరిసరాల్లో ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలంటూ వరంగల్ డీఈఓ కార్యాలయం పేరున ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు సర్క్యులర్ జారీ కావడం మరింత ఆందోళనకు గురి చేస్తోంది. గత వారం పది రోజులుగా నగరంలో సాగుతున్న కిడ్నాప్ కథనాలపై పోలీస్ యంత్రాంగం క్లారిటీ ఇవ్వకపోవడంతో పేరెంట్స్ బిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్

## యూత్ ఐకాన్.. బోడ డిన్న



- చిన్న వయసులోనే ప్రజా సమస్యలపై పట్టు
- తెలంగాణ ఉద్యమంలో చెరగని ముద్ర
- కేసీఆర్‌కు నమ్మిన బంటుగా ప్రత్యేక గుర్తింపు
- వరంగల్ పార్లమెంట్ బరిలో నిలిచేందుకు ఉత్సాహం
- అవకాశం ఇస్తే గెలిచి తీరుతానంటూ ధీమా

ప్రత్యేక కథనం- 7,8 లలో..



8లో

## బీఆర్ఎస్‌కు మరో షాక్..

- పార్టీని వీడే ఆలోచనలో మాజీ మంత్రి ఎర్రబెల్లి ముఖ్య అనుచరుడు
- నమ్మక ద్రోహం చేశారంటూ నిట్టూర్పు



2లో

## బల్దియా ఇంచార్జి కమిషనర్‌గా రాధిక గుప్తా

శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



# కిడ్నాప్.. కిడ్నాప్..

**నగరంలో పుకార్లు షికార్లు**

**ముఠాలు సంచరిస్తున్నాయంటూ ప్రచారం**

**భయభ్రాంతులకు గురవుతున్న పేరెంట్స్**

**కొత్త వ్యక్తులు కనిపిస్తే ఫిర్యాదు చేయాలంటూ డీఈఓ కార్యాలయం నుంచి ఆదేశాలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలో కిడ్నాప్ వార్తలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. నిత్యం ఫలానా ప్రాంతంలో విద్యార్థి.. మరో ప్రాంతంలో మరొకరు కిడ్నాప్ కు గురయ్యారంటూ వార్తలు వైరల్ అవుతున్నాయి. బురఖాలు ధరించిన ఇద్దరు, ముగ్గురు ఆటోలో వచ్చి ఫలానా పాఠశాల విద్యార్థిని కిడ్నాప్ చేశారంటూ చెప్పుకొంటున్నారు. స్కూటీపై వచ్చిన మహిళ బాలుడిని కిడ్నాప్ చేసేందుకు యత్నించారని, బిగ్గరగా అరవడంతో వదిలి పారిపోయారంటూ ప్రచారం సాగుతోంది. అయితే ఇలాంటి కిడ్నాప్ వార్తలను పోలీసులు ధృవీకరించకపోయినా దీనిపై ఒక క్లారిటీ ఇవ్వకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది.

## ముఠా సంచారం..

పిల్లలను, విద్యార్థులను కిడ్నాప్ చేసేందుకు నగరంలో ఒక ముఠా ప్రవేశించిందన్న ప్రచారం జోరుగా సాగుతోంది.
ఈ ముఠా సభ్యులు ఇప్పటికే పలువురిని కిడ్నాప్ చేశారని చెప్పుకొంటున్నారు. వీరు గ్రూపులుగా విడిపోయి నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సమీపంలో ఒంటరిగా ఉన్న విద్యార్థుల కిడ్నాప్ కు పాల్పడుతున్నారని ప్రచారంలో ఉంది. రంగసాయిపేటలో ఇద్దరు బాలికల కిడ్నాప్ కు గురయ్యారంటూ ప్రచారం సాగుతుండగా, ఉర్సు గుట్ట సమీపంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో మరో విద్యార్థి కిడ్నాప్ కు ప్రయత్నించారన్న వార్తలు ట్రెండింగ్ అవుతున్నాయి. అయితే ఈ ముఠాలోని కొంత మందిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారని, మరికొందరికోసం గాలిస్తున్నారంటూ వార్తలు వైరలవుతున్నాయి.

## డీఈఓ సర్క్యులర్..

విద్యార్థుల కిడ్నాప్ వార్తలు వైరల్ అవుతున్న నేపథ్యంలో జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా వ్యవహరించాలంటూ వరంగల్ డీఈఓ కార్యాలయం పేరిట సర్క్యులర్ జారీ అయింది. విద్యార్థుల రక్షణకోసం అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులను పాఠశాల ఆవరణలోకి అనుమతించరాదంటూ సూచించారు. ఇంటర్వల్, లంచ్ బ్రేక్ లో విద్యార్థులెవరూ పాఠశాల ఆవరణను విడిచి బయటికి పోకుండా చూడాలంటూ ఆదేశించారు. పాఠశాలల పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తులు సంచరించినా, అనుమానాస్పదంగా కనిపించినా అత్యవసర నెంబర్లు 1098, 112, 100 ఫోన్ చేసి సమాచారం అందించాలంటూ సూచించారు. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలంటూ ఆ సర్క్యులర్ లో పేర్కొన్నారు.

## ఆందోళనలో పేరెంట్స్..

విద్యార్థుల కిడ్నాప్ వార్తలు నగరంలో కలకలం సృష్టిస్తున్నాయి. విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలకు గురవుతున్నారు. పిల్లలను కిడ్నాప్ చేసి వారితో భిక్షాటన చేయిస్తున్నారని, వారి అవయవాలను అమ్ముకున్నారంటూ ప్రచారం సాగుతోంది. దీంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులకు తోడుగా వారి పేరెంట్స్ కూడా వస్తున్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# బీజేపీలో చేరిన అభినవ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఢిల్లీలో కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో గురువారం మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు జీడబ్ల్యుఎంసీ 60వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ దాస్యం అభినవ్ భాస్కర్ భారతీయ జనతా పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ నరేంద్ర మోడీ జనరంజక పాలనకు ఆకర్షితులై యువత బీజేపీ వైపు చూస్తున్నారన్నారు. బీఆర్ఎస్ లో ఉన్న నేతలంతా బీజీపీలో చేరాలని పిలుపు నిచ్చారు. అనంతరం దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ యుగపురుషుడు నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం పురోగమిస్తోందని, బీజేపీ ప్రభుత్వం ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజారిటీతో మోడీ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు ఒక సైనికుడిలా పని చేస్తానన్నారు. అనంతరం అభినవ్ భాస్కర్ బీజేపీ కేంద్ర కార్యాలయంలో బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, తెలంగాణ వ్యవహారాల ఇంచార్గి తరుణ్ చుగ్, నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్, రాష్ట్ర సంఘటన కార్యదర్శి చంద్రశేఖర్ లను కూడా మర్యాద పూర్వకంగా కలిశారు.

# గట్టమ్మ ఎదురు పిల్ల పండుగకు లక్ష్మీదేవర్ల పిలుపు

## గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సురేందర్



**వరంగల్ వాయిస్, ములుగు :** ఆదివాసీ నాయకపోడ్ గట్టమ్మ పూజారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఎదురు పిల్ల పండగ సందర్భంగా లక్ష్మీ దేవర్ల పిలుపుకు వెళ్లడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆదివాసి నాయకపోడ్ ములుగు జిల్లా అధ్యక్షుడు, గట్టమ్మ ప్రధాన పూజారి కొత్త సురేందర్ మాట్లాడుతూ మాఘశుద్ధ రోజులలో ములుగు గట్టమ్మ ఎదురూ పిల్ల పండగ నిర్వహిస్తామన్నారు. ఆదివాసి నాయకపోడు ఆచార సంస్కృతి సంప్రదాయాలు ఇతర ఆదివాసుల సంస్కృతిల కంటే భిన్నంగా ఉంటాయన్నారు. పాండవుల వంశముగా ఉన్న ఆదివాసి నాయక పోడు కులస్తులు నేటికీ లక్ష్మీ దేవర్ల ప్రతిమల పంచ పాండవులను పూజించడం ఆచారమన్నారు. గట్టమ్మ పూజారుల ఆధ్వర్యంలో 14వ తేదీ బుధవారం గట్టమ్మ ఎదురు పిల్ల పండగను ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి నాయక పోడుల సంస్కృతి సంప్రదాయాలు కనువిందు చేస్తాయన్నారు. ములుగు గట్టమ్మ మహా జాతర మినీ మేడారంలా సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గట్టమ్మ ప్రధాన పూజారులు కొత్త సదయ్య, కొత్త లక్ష్మయ్య, ఆకుల మొగిలి, అరిగిలా సమ్మయ, ఆకుల రాజు, అచ్చ రాజు, కొత్త రమేష్, పిట్టల మల్లేష్, రాజశేఖర్, కుమార్, సింగం స్వామి, సమయం, కోట నరసింహం, చంద్రు సారంగపాణి, నరసయ్య పాల్గొన్నారు.

# మోదీ చొరవతో.. పీవీకి భారత రత్న

**ఆయన సేవల్ని పూర్తిగా విస్మరించిన కాంగ్రెస్**

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్**

**లక్నేపల్లీ పీవీ స్మారక మందిరంలో ఘన నివాళులు**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** దివంగత మాజీ ప్రధాని, రాజనీతిజ్ఞుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ నరసింహారావు ను కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించినా, ఆయన సేవల్ని గుర్తించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ అత్యున్నత పురస్కారం భారత రత్న అవార్డు ప్రకటించి సమున్నత స్థానం కల్పించిందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. పీవీకి భారతరత్న ప్రకటించిన సందర్భంగా శుక్రవారం ఆయన జన్మస్థలం లక్నేపల్లి గ్రామంలో పీవీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. పీవీని భారత రత్నకు ఎంపికవడం దేశ ప్రజలందరికీ గర్వకారణం అన్నారు. పీవీ చేసిన సేవలను కొనియాడారు. పీవీ స్మారక మందిరంలో తిరుగుతూ పీవీ దేశానికి సేవలను గుర్తు చేసుకున్నారు. ఆర్థిక సంస్కరణలతో భారతదేశ పురోగతికి పీవీ పునాదులు వేసినా, జీవితాంతం కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ.. పార్టీ సాధారణ కార్యకర్తనుంచి దేశ ప్రధానిగా ఎదిగినా కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, వారి కుటుంబ సభ్యులు ఏనాడూ పీవీని పట్టించుకోలేదని మండిపడ్డారు. పైగా కాంగ్రెస్ పార్టీ పెద్దలు పీవీ నరసింహారావు పట్ల కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. తుదిశ్వాస విడిచిన తర్వాత కూడా పార్టీ కార్యాలయంలోకి పార్థివ దేహాన్ని రానీయకుండా అవమానించారన్నారు. పీవీకి భారత రత్న ఇవ్వడం దేశ ప్రజలందరికీ గర్వ కారణమని, ఇందుకు కేంద్రానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు గంట రవికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ వడ్డపల్లి నరసింహ రాములు, ప్రధాన కార్యదర్శి రేసు శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు కంభంపాటి పుల్లారావు, నర్సంపేట నియోజకవర్గ యువ నాయకుడు రాణా ప్రతాపరెడ్డి, దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు నల్లబెల్లి సుదర్శన్, శక్తి కేంద్ర ఇన్చార్జి బుసాని సుదర్శన్, రూరల్ మండలం ప్రధాన కార్యదర్శి ముతినేని వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు, బీజేపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## తునికాకు టెండర్లను వెంటనే పిలవాలి

### సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ డిమాండ్




**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట రేంజ్ పరిధిలోని మండలాల్లో తునికాకు సేకరణ కోసం టెండర్లను వెంటనే పిలవాలని న్యూ డెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. నర్సంపేట రేంజ్ ఆఫీసర్ రవి కిరణ్ కు అఖిలభారత రైతు కూలి సంఘం, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ లోని నర్సంపేట, నల్లబెల్లి, ఖానాపురం మండలాలతో పాటు రెడ్లవాడ తదితర గ్రామాలలో గత సంవత్సరం తునికాకు టెండర్లు పిలువనందు వల్ల వేసవికాలంలో గిరిజన పేదలకు ఉపాధి దెబ్బతిన్నదని వారన్నారు. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వానికి రావలసిన ఆదాయం కూడా ఆగిపోయిందని కాబట్టి, వెంటనే టెండర్లు పిలవాలని వారు డిమాండ్ చేశారు. గతంలో ఆకు సేకరించిన వ్యవసాయ కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బులు కూడా చెల్లించలేదని వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నర్సంపేట డివిజన్ కమిటీ కార్యదర్శి ఎలకంటి రాజేందర్, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిలి ప్రతాపరెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు రాచర్ల బాలరాజు, డివిజన్ కార్యదర్శి జక్కుల తిరుపతి, బుర్ర వీరస్వామి, కొంపల్లి సాంబయ్య, బిగిని రవి తదితరులు ఉన్నారు.

## పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ బిడ్డ , బహుభాషా కోవిదులు, స్థితప్రజ్ఞ కీర్తిశేషులు పీవీ నరసింహారావుకు అత్యంత ప్రతిష్ఠాత్మక భారతరత్న పురస్కారం ప్రకటించటం యావత్ తెలంగాణ ప్రజలకు గర్వకారణమని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఈ పురస్కారాన్ని ప్రకటించినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఇప్పటికైనా పీవీ దేశానికి సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం వారికి ఈ పురస్కారాన్ని ప్రకటించటం సంతోషమని ఆయన అన్నారు.

## 27న కామర్స్ విభాగంలో జాతీయ సదస్సు



**వరంగల్ వాయిస్, కేయూ :** యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్ మెంట్ విభాగంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ వారి ఆర్థిక సహకారంతో "ఫిన్టెక్ విప్లవం – డిజిటల్ యుగంలో ఆర్థిక సేవలను పునర్ నిర్మించడం"అంశంపై మార్చి 27, 28న రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించడానికి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ , కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వైస్ ప్రిన్సిపల్, ప్రొఫెసర్ జి.హనుమంతు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఏ.రాజు, సెమినార్ డైరెక్టర్ మాదాసి కనకయ్య, అధ్యాపకులు సెమినార్ బ్రోచర్ ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగ అధ్యాపకులు డాక్టర్ సావుల సురేష్, డాక్టర్ ఏ సునీత, డాక్టర్ మయూరి శ్రీవాస్తవ, డాక్టర్ బక్కి శ్రీనివాస్, డాక్టర్ జె రజిని, డాక్టర్ ఏ సురేష్, డాక్టర్ కాలూరి సోమశేఖర్, డాక్టర్ ఎం గిరిప్రసాద్, కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ సరళా దేవి, పీఆర్ఓ డాక్టర్ ఆదిరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ చిర్ర రాజు, డాక్టర్ ఫిరోజ్ పాషా షేక్, డాక్టర్ టి.శేషు, డాక్టర్ భాస్కర్, డాక్టర్ పి. రమేష్, డాక్టర్ మామిడి లింగయ్య, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి

### మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** రానున్న పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చాటాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వారి నివాసంలో నియోజకవర్గంలోని పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర, గీసుగొండ, సంగెం మండలాల ఎంపీపీ, జడ్పీటీసీ, మండల అధ్యక్షులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులతో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ గడిచిన పది సంవత్సరాలలో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు సక్రమంగా వినియోగిస్తూ, పంచాయతీలను అభివృద్ధి పర్చుకోవడంలో సర్పంచుల కృషి మరవలేనిదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన గడువు ముగిసిన సర్పంచులను చల్లా ధర్మారెడ్డి ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్య పడకుండా ముందుకు సాగాలని, వారికి తనతో పాటు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, తాను ప్రజల మధ్యే ఉంటానని చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతానని స్పష్టం చేశారు. రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా ఏంటో చూపాలని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజా క్షేత్రంలో ఉంటూ సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని పిలుపునిచ్చారు. మీ అందరి సహకారంతో పరకాల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కాంగ్రెస్ నాయకులు అహంకారంతో మాట్లాడుతున్నారని, చిన్నా, పెద్ద, వయస్సు అనుభవంతో తేడా లేకుండా స్థాయిని మరిచి ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ సర్కారు మొదలు పెట్టిన పనులే ఇప్పుడు ప్రారంభిస్తున్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు పరకాల నియోజకవర్గ ప్రజల తరపున పోరాడుతామని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని స్పష్టం చేశారు. 'కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని, ఆరు గ్యారెంటీలపై ఆ పార్టీ నాయకులను గ్రామగ్రామాన నిలదీయాలని, కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దనిప్రజల పక్షాన నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పరకాల, నడికూడ, ఆత్మకూర్, దామెర, గీసుగొండ, సంగెం మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## 16న దేశవ్యాప్త సమ్మెకు ఏఐసీటీయూ మద్దతు

### విజయవంతం చేయాలని పిలుపు

### ఏఐసీటీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ మాషూక్




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** ఈనెల 16న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు తలపెట్టిన సమ్మె, గ్రామీణ బంద్‌కు అఖిల భారత కార్మిక సంఘాల కేంద్రం (ఏఐసీటీయూ) సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని ఆ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ మాషూక్ తెలిపారు. చెన్నారావుపేట మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వర్గాలకు తీరని ద్రోహం చేస్తుందని, కార్మిక చట్టాలను కాలరాస్తూ వారి ప్రయోజనాలను హరిస్తుందని తెలిపారు. ఈ బంద్‌కు కార్మిక వర్గాలు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తున్న ప్రజా కార్మిక వ్యతిరేక, మతోన్మాద విధానాలను ఎండగట్టాలన్నారు. రైతాంగానికి కార్మిక వర్గానికి బీజేపీ ప్రభుత్వంతో ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. ఈ సమావేశంలో ఎంసీపీఐ(యూ)జిల్లా కమిటీ సభ్యులు కొత్తకొండ రాజమౌళి, ఎంసీపీఐ(యూ)చెన్నారావుపేట మండల కార్యదర్శి జన్ను రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు భవాని తదితరులు పాల్గొన్నారు.

## సీపీని మర్యాదపూర్వకంగా కలిసిన సీఐలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వుల మేరకు నూతనంగా స్టేషన్ ఇన్ స్పెక్టర్లుగా బాధ్యతలు చేపట్టిన ఇన్ స్పెక్టర్లు శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ను కమిషనరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛాలు, పూల మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్ స్పెక్టర్లకు పోలీస్ కమిషనర్ ముందుగా అభినందనలు తెలియజేశారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ నిజాయితీతో విధులు నిర్వహిస్తూ, న్యాయం జరుగుతుందనే భరోసాను బాధితులకు కల్పిస్తూ, ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తూ విధులు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు తెలిపారు. పోలీస్ కమిషనర్ ను కలిసిన వారిలో మట్టేవాడ, హనుమకొండ, నర్సంపేట, పరకాల, అత్మకూరు, గీసుగొండ, రఘునాథ్ పల్లి సర్కిల్, నెక్కొండ సర్కిల్, ట్రాఫిక్, వరంగల్ ట్రాఫిక్, టాస్క్ ఫోర్స్ ఇన్ స్పెక్టర్లు గోపి, సతీష్, రమణ మూర్తి, అబ్బయ్య, సంతోష్, బాబూలాల్, శ్రీనివాస్, చంద్రమోహన్, శ్రీధర్, కరుణాకర్ వున్నారు.

# వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం




**వరంగల్ వాయిస్, పరకాల :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, హనుమకొండ మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం భిక్కోజీ నాయక్ తండా గ్రామంలోని గ్రామ పంచాయతీలో వృద్ధులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఆరోగ్య శిబిరాన్ని హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్ మెంట్ ఆఫ్ ఎంపవర్ మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్ సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందన్నారు. ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని, ఇలాంటి వైద్య శిబిరాలను గ్రామాలలోని వృద్ధులంతా సద్వినియోగం చేసుకోవాలని పాలకవర్గం కోరారు. ఈ సందర్భంగా సంగెం మండల బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సపవత్ మహేందర్ నాయక్ చైర్మన్, కోశాధికారిని శాలువాతో సన్మానించారు. ఈ ఆరోగ్య శిబిరంలో రెడ్ క్రాస్ డాక్టర్లు డా.జి.కిషన్ రావు, డా.మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, పవన్, కేశోజు రమేష్, సుమంత్, ఈ ఆరోగ్య శిబిరానికి సంగెం మండల బీజేపీ ఎస్టీ మోర్చా అధ్యక్షుడు సపవత్ మహేందర్ నాయక్ సహకారం అందజేశారు. గ్రామ సర్పంచ్ బానోత్ సంధ్యారాణి, ఎంపీటీసీ బానోత్ పద్మ, గ్రామస్తులు వంశీ కృష్ణ, బాలు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రికార్డుల నిర్వహణ తీరును పెంచాలి



**వరంగల్ వాయిస్, నెల్లికుదురు :** గ్రామపంచాయతీ రికార్డులను రోజు వారీగా పరిశీలిస్తూ నిర్వహణ తీరును మెరుగుపరచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. శుక్రవారం అదనపు కలెక్టర్ గ్రామాలలోని మౌలిక వసతుల కల్పనలో భాగంగా చేపట్టిన స్పెషల్ డ్రైవ్ లో నెల్లికుదురు మండలంలోని వావిలాల గ్రామాన్ని సందర్శించి గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్వాడి కేంద్రం, మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల, పాఠశాలలోని మరుగుదొడ్లు, మధ్యాహ్న భోజన పథకం, నర్సరీ, వైకుంఠధామం ల నిర్వహణ తీరును సందర్శించి పరిశీలించారు. ముందుగా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. టాక్స్ కలెక్షన్ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. 100 శాతం చేపట్టాలన్నారు. రికార్డులలో నమోదు వెంటనే చేయాలని జాప్యం తగదన్నారు. గ్రామంలో పర్యటిస్తూ పారిశుద్ధ్యం పనితీరును పెంచాలని అధికారులకు తెలియజేశారు. అదే గ్రామంలోని మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల సందర్శించి అంగన్వాడీ కేంద్రం పనితీరును పరిశీలించారు. అనంతరం పాఠశాలలోనే ఒకటో తరగతి విద్యార్థుల ప్రతిభను పరిశీలించారు. మరుగుదొడ్లు మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాలను పరిశీలించి నర్సరీని సందర్శించారు. నర్సరీ నిర్వహణ పెంచాలని నిర్వాహకులకు సూచించారు. ప్రక్కనే ఉన్న వైకుంఠధామం సందర్శించి దహన సంస్కారాలకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిగ్రీ గేషన్ షెడ్ సందర్శించి చెత్త విభజనను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సెగ్రీ గేషన్ షెడ్ లో చెత్త విభజన రోజువారీగా జరగాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా ప్లాస్టిక్ వస్తువులు వినియోగాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కలెక్టర్ వెంట నెల్లికుదురు ఎంపీడీవో శేషాద్రి, పంచాయతీ సెక్రెటరీ నాగజ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే

### హాజరైన ఝాన్సీ రాజేందర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, పాలకుర్తి :** పట్టణ కేంద్రంలో కార్మెల్ కాన్వెంట్ స్కూల్ లో జరిగిన 2023-24 చిల్డ్రన్స్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలో ముఖ్యఅతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి హాజరు కాగా పాఠశాల యాజమాన్యం ఘనస్వాగతం పలికారు. చిన్నారులు ఆటపాటలతో అలరించారు. ఎల్ కేజీ, యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు యంగ్ గ్రాడ్యుయేషన్ పట్టాలను ఝాన్సి రాజేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఝాన్సీ రెడ్డి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులు, కష్టం తెలియని జీవితం మీది, చదువుపై దృష్టి పెట్టండి గొప్ప గొప్ప విజయాలు సాదించండని, భవిష్యత్తు లో మీరే ఒక యశస్విని ఝాన్సి రెడ్డిలు అవుతారన్నారు. ఇంత చక్కటి కార్యక్రమంలో పాల్గొన్నందుకు చాలా సంతోషంగా ఉందని, ఆహ్వానించిన పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ముఖ్యనాయకులు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు, పాల్గొన్నారు.

## జయముఖిలో ప్రారంభమైన గ్యాలన్స్ క్రికెట్ ట్రోఫీ



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని జయముఖి ఫార్మసీ కళాశాలలో గ్యాలెన్స్ (ఫార్మసీ ప్రెస్టేజియస్ లీగ్-2) క్రికెట్ టోర్నీని శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ టోర్నీలో ఇరవై ఫార్మసీ కళాశాల జట్లు ముఖాముఖి తల పడనున్నాయి. ఈ సందర్భంగా టోర్నీ నిర్వాహకులు, జయముఖి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాసుదేవ మూర్తి మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంత అవసరమన్నారు. అలాగే జయుముఖి జేఎన్ టీయూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ మానసిక, శారీరక ఆరోగ్యంలో క్రీడల ప్రాముఖ్యత గురించి వివరించారు. హనుమకొండ వాగ్దేవి ఫార్మసీ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా శ్రీనివాస్ రెడ్డి మొబైల్ ఫోన్ దుష్పరిణామాలు, క్రీడల ఆవశ్యకతపై విద్యార్థులకు హితోపదేశం చేశారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో జయముఖి కాలేజ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శంకర్ రెడ్డి, వాగ్దేవి ఫార్మసీ (జేఎన్ టీయూ) బొల్లికుంట కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ యాదవ్, బాలాజీ ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాంసుందర్, శివాని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, గ్యాలెన్స్ టోర్నీ చీఫ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బస్వరాజ్ మచ్చ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రెస్లింగ్‌లో జయముఖి విద్యార్థికి మెడల్



**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన స్టేట్ లెవెల్ రెస్లింగ్ టోర్నమెంట్ లో జయముఖి కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి డప్పు గణేష్ కు బ్రాంజ్ మెడల్ తృతీయ బహుమతి వచ్చిందని ఒక ప్రకటన ద్వారా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. జానకి, కళాశాల యాజమాన్యం శంకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పతకం సాధించాని గణేష్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి.జానకి, ట్రెజరీ జీ.శంకర్, ఫిజికల్ డైరెక్టర్ వెంగళరావు, సతీష్, వెంకటేశ్వర్లు, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి ఆటోలో వెళ్లిన ఎమ్మెల్సీ సత్యవతి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఆటో డ్రైవర్లకు మద్దతుగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ శుక్రవారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి ఆటోలో చేరుకున్నారు. ఆటో కార్మికులకు నెలకు రూ.10వేల సాయాన్ని ప్రకటిస్తూ బడ్జెట్ లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల 21 మంది ఆటో డ్రైవర్లు చనిపోయారని, ఆటో డ్రైవర్ల పోరాటానికి మద్దతుగా తాను అసెంబ్లీకి ఆటోలో వచ్చానన్నారు. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటో డ్రైవర్లు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాల వల్ల ఉపాధి లేకుండా పోయారని, దీంతో వాళ్ల కుటుంబాలకు రోడ్డున పడ్డాయని అన్నారు. ఈ నేపథ్యంలోనే కుటుంబాన్ని పోషించలేక ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో ఆటో కార్మికులకు నెలకు పదివేల సాయాన్ని ప్రకటిస్తూ బడ్జెట్ లో ప్రవేశపెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

## పెండింగ్ స్కాలర్ షిప్స్‌ను విడుదల చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీకేఎం కళాశాల రోడ్డులోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ లను గత ప్రభుత్వం అందించలేదన్నారు. నూతన ప్రభుత్వం విద్య రంగానికి అధిక బడ్జెట్ కేటాయించాలని, అలాగే గురుకులాలకు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించి మెస్ కాస్మొటిక్ ఛార్జీలు పెంచాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఈ ప్రభుత్వం పాఠశాలలు, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి కొత్త భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ హరీష్, సాగర్, మౌటం శివ కుమార్, మిరియాల్కర్ సంతోష్, రాజేష్, నీవిల్ అభిరామ్, ప్రభాస్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని ముస్తాలపల్లి గ్రామానికి చెందిన బందెల రామస్వామి శుక్రవారం అనారోగ్యంతో మరణించగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం నడికూడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుర్ర దేవేందర్ గౌడ్ వారికి పూల మాలవేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యం నింపారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నడికూడ మండల ప్రధాన కార్యదర్శి డా.కుడ్ల మనహర్రావ్ , ఉపాధ్యక్షుడు బొట్ల రవి, ముస్తాలపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు బందెల దామోదర్, మాజీ ఉప సర్పంచ్ బందెల సారయ్య, వార్డు మెంబరు బందెల స్వామి, సీనియర్ నాయకుడు ఎండీ రంజాన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్ల అనిల్, సురేందర్, సంఘాల విజేందర్, అరవింద్, ముంజ విజేందర్, వెంకటేష్, సాగర్, కన్నయ్య, సాంబయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 11 నుంచి గోవర్ధన గిరి ఉర్సు ఉత్సవాలు

### దర్గా వద్ద భారీ ఏర్పాట్లు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** జనగాం జిల్లా రఘునాథపల్లి మండలం గోవర్ధనగిరి దర్గా ఉత్సవాలు ఈనెల 11, 12న ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి సంవత్సరం హిందూ-ముస్లింలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ దర్గాకు రావడం ఆనవాయితీ. హజ్రత్ సయ్యద్ బురానుద్దిను శా యాకూబ్ పాషా దర్గా జాతీయ రహదారిపై ఉండడంతో ప్రతినిత్యం ప్రజలు వచ్చి పోతుంటారు. ఆదివారం సాయంత్రం జనాబ్ అబ్బాస్ సాహు బూ ఇంటి నుంచి బయలుదేరి గ్రామం ఊరేగింపు తర్వాత దర్గా షరీఫ్ చేరుకుంటది. అనంతరం భక్తులు,ప్రజలు పాల్గొన్న సమయంలో గంధం ఏర్పాటు చేస్తారు. ఈ సందర్భంగా వచ్చే భక్తులకు, ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## మిల్స్ కాలనీ సీఐను కలిసిన శామంతుల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** కాంగ్రెస్ నాయకుడు, పోపా రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది శామంతుల శ్రీనివాస్ మిల్స్ కాలనీ సీఐ మల్లయ్యను శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాది శమంతుల. ఆయన వెంటన 34వ డివిజన్ మహిళా అధ్యక్షురాలు రావుల విజయ రామచందర్, ముత్యాల విజయ్, పత్తురవుల విజయరామచందర్, ముత్యాల విజయ్, పట్టూరి సుధాకర్, తిరునగరి వెంకన్న, దేవరాజ్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మాపురం పాఠశాల పిల్లలు జిల్లాకే ఆదర్శం

### జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** అమ్మాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మహబూబాబాద్ జిల్లాకు ఆదర్శవంతులని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. కాటన్ కనెక్ట్, మైరాల్డ్ సంస్థల ఆధ్వర్యంలో తొర్రూరు మండలం అమ్మాపురం ప్రాథమిక పాఠశాలకు డిజిటల్ తరగతుల బోధన కోసం సుమారు ఆరు లక్షల విలువైన ఎల్ఈడీ ప్యానల్స్ ను జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా అందించడం జరిగింది. అనంతరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవాలని, జిల్లాలోని అన్ని ప్రాథమిక పాఠశాలలో ఎక్కువమంది విద్యార్థులు ఉన్న అమ్మాపురం పాఠశాలను ఎంపిక చేసుకొని డిజిటల్ తరగతుల బోధన కోసం ఐఎఫ్ టీ ప్యానల్స్ రెండు అందజేసిన కానట్ కాటన్ కనెక్ట్ సంస్థ వారికి అలాగే మైరాల్డ్ సంస్థ ప్రతినిధులందరికీ పాఠశాల పక్షాన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటన్ కనెక్ట్ సంస్థ తెలంగాణ ఇంచార్జి చింతయ్య, మైరాల్డ్ సంస్థ మహబూబాబాద్ జిల్లా కోఆర్డినేటర్ కే శ్రీనివాసరావు, తొర్రూరు మండల నోడల్ ఆఫీసర్ మహంకాళి బుచ్చయ్య, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీను బాబు,అమ్మాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, గ్రామ స్పెషల్ ఆఫీసర్ తుమ్మ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు ముద్దం విక్రమ్ రెడ్డి, విద్యా అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవుడి వెంకటరెడ్డి, మైరాల్డ్ సంస్థ బ్లాక్ కోఆర్డినేటర్ దాసు, ఎగ్జిక్యూటివ్ బందు దర్గయ్య, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలి



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** రానున్న లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని బొంద పెట్టాలని, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఎక్కడ పోటీ చేసినా ఓడించాలని మహిళలకు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సునీతరావు పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన మహబూబాబాద్ లోక్ సభ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ పార్టీ సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ మహిళలకు చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ కోసం మహిళలు ఐకమత్యంగా అలుపెరుగని పోరాటం చేయాలని, రాష్ట్రంలో 17లోక్ సభ నియోజకవర్గాల్లో 33శాతం మహిళలకు టికెట్లు కేటాయించాలని కోరారు. ఆడ బిడ్డల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో డబుల్ బెడ్ రూములు, బీసీ, దళిత బంధు పథకాలు ప్రజలకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల అములులో దళారులు డబ్బులు దండుకున్నారని విమర్శించారు. మణిపూర్ లో మహిళలను నగ్నంగా ఊరేగింపు నిర్వహిస్తే మోదీ ప్రభుత్వం బాధితులను పరామర్శించక పోగా, నిందితులపై చర్యలు చేపట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు నూనావత్ రాధ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పీవీకి భారతరత్న రావడంపై మడికొండ శ్రీను హర్షం



**వరంగల్ వాయిస్, పరకాల :** భారత మాజీ ప్రధాని తెలుగు బిడ్డ పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం పట్ల పరకాల బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ మడికొండ శ్రీను హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశం నుంచి తెలుగు రాష్ట్రం నుంచి ఏకైక ప్రధానిగా కొనసాగి దేశాన్ని ఆర్థిక లోటు నుంచి ఎదుగుతున్న దేశంగా తయారు చేసిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. సంస్కరణల పితామహుడిగా పేరుపొంది భారతదేశాన్ని అగ్రరాజ్యాల సరసన నిలబెట్టిన ఘనత పీవీ నరసింహారావుదే అని కొనియాడారు. ఆయన చేసిన ఆర్థిక సంస్కరణ వల్లనే నేడు దేశంలో సాంకేతిక విప్లవం కొనసాగుతుందని అన్నారు. ఆయనను గుర్తించి భారతరత్న ప్రకటించడం పట్ల తెలుగు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

## ఆశా వర్కర్లకు పెండింగ్ పారితోషికాలు చెల్లించాలి

### సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సిఐటియు హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రెండు నెలల పారితోషికాలు ఇవ్వాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా వైద్యాధికారి కార్యాలయం ముందు ధర్నా జరిగింది. రెండు నెలల బకాయి వేతనాలు చెల్లించాలని ఏఎన్ సీ టార్గెట్లను ఎత్తివేయాలని ఫిక్స్ వేతనం ఇవ్వాలని, సీఐటీయూ జిందాబాద్ అంటూ మూడు గంటల పాటు ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ జిల్లాలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు డిసెంబర్, జనవరి రెండు నెలల పారితోషికాలు ఇంకా రాలేదన్నారు. గతంలో ప్రతి నెల 2న పారితోషికాలు ఆశా వర్కర్ల అకౌంట్ లో పడేవి. కానీ ఇప్పుడు రెండు నెలలు దాటినా ఆశా వర్కర్లకు నేటికీ పారితోషికాలు అకౌంట్ లో పడలేదన్నారు. పారితోషికాలు నెలల తరబడి రాకపోవడంతో కుటుంబం అవసరాల కోసం అప్పు చేసి బతకాల్సిన దుర్భర పరిస్థితికి ఆశా వర్కర్లు వచ్చిందన్నారు. 18సంవత్సరాల నుంచి ఆశా వర్కర్లుగా పనిచేస్తున్న వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గానికి చెందినవారు. వీరికి నేటికీ కనీస వేతనం ఇవ్వడం లేదు, ఫిక్స్ వేతనం కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయం చేయలేదు. ప్రభుత్వం చెల్లిస్తున్నవి చాలీచాలని అతి తక్కువ పారితోషికాలు మాత్రమే. ఇవి కూడా సకాలంలో రాకపోవడంతో ఆశాలు అనేక ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యురాలు కాసు మాధవి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషికాలను రూ. 18000లకు పెంచి ఫిక్స్ వేతనం నిర్ణయించాలన్నారు. ఆశాలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. టీబీ స్పూటమ్ డబ్బాలను ఆశాలతో మోయించే పనిని రద్దు చేయాలన్నారు. ఆశాలను ప్రసూతి సెలవుల పైన ఉత్తీర్వలు వెంటనే జారీ చేయాలని కోరారు. ఆశాలకు రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ. 5లక్షలు ఇవ్వాలని, మట్టి ఖర్చులు రూ. 50 వేలు చెల్లించాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ. 5లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును ఏవోకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు యాకూబీ, రజిత, శ్రీవాణి, రమ, పద్మ, శోభ, శ్వేత, పుతిలి, గంగ, జమున, నవమని తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి



**వరంగల్ వాయిస్, సుబేదారి :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డిని ఉద్దేశించి బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, బేషరతుగా బాల్క సుమన్ సీఎంకు క్షమాపణ చెప్పాలని ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ న్యాయవాదులు డిమాండ్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ ఎస్ నాయకుడు బాల్కసుమన్ దిష్టి బొమ్మను ఉమ్మడి వరంగల్ జిల్లా లీగల్ సెల్ వేముల రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం అదాలత్ జంక్షన్ లో దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉస్మానియా విద్యార్థి నాయకుడిగా, తెలంగాణ ఉద్యమ నాయకుడిగా చెప్పుకునే బాల్క సుమన్ ఎన్నికల్లో ఓటమికి గురై విచక్షణ కోల్పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బలంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధించిన గెలుపును బీఆర్ఎస్ పార్టీ నాయకత్వం జీర్ణించుకోవడం లేదని విమర్శించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమే ధ్యేయంగా ఇచ్చిన 6 గ్యారంటీల పథకాలను అమలు చేసే దిశగా ప్రజా దీవెనలతో ముందు సాగుతున్న ప్రభుత్వ పాలనను బీఆర్ఎస్ నాయకత్వానికి నచ్చడం లేదని,అందుకే ఇలాంటి చౌకబారు చర్యలకు పాల్పడుతుందని ఎద్దేవా చేశారు. బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే భేషరతుగా వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఆయనకు గుణపాఠం తప్పదని ఉమ్మడి వరంగల్ జిల్లా న్యాయవాదులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వేముల రమేష్, కందుకూరి, రజినీకాంత్, సిద్ధం యుగేందర్, అరుణ్ ప్రసాద్, మహేందర్, కునూరు రంజితకుమార్, ఆనంద మోహన్, తోట రాజకుమార్, పోతరాజు రవి, రమేష్ నాయక్, నల్ల మహాత్మా, విజయ్ భాస్కర్ రెడ్డి, నిఖిల్, శ్రీనాథ్, వినయ్, జగన్మోహనరెడ్డి, పోషిని రవీందర్, రావుల శ్రీనివాసరెడ్డి, పిల్లి కార్తీక్, అరుణ్, సుదర్శన్, మునిగాల రవీందర్, అశోక్, అనిల్, న్యాయవాదులు పాల్గొన్నారు.

## లైఫ్ ఇన్సూరెన్స్ జీవితాలకు భరోసా



**వరంగల్ వాయిస్, ములుగు :** శ్రీరామ్ ఇన్సూరెన్స్ ఒక యుగమని, శ్రీరామ్ ఇన్సూరెన్స్ లో చేరండి.. కుటుంబాలను అభివృద్ధి పరచుకోండని శ్రీరామ్ మేనేజర్ వినయ్ అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలో సుప్రసిద్ధిగాంచిన రామప్ప దేవస్థానం ఆవరణలో ఉమ్మడి వరంగల్ జిల్లా డీఓలతో సేల్స్ ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ జీవితాలను మారుస్తుందన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సేల్స్ మెన్ గా ఉన్నవారు శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ లో చాలామందిని చేర్చారని తెలిపారు. వారందరికీ శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ లైఫ్ ఇస్తుందని పేర్కొన్నారు. అలాగే లైఫ్ ఇన్సూరెన్స్ లో ముందుగా ఎక్కువ మందని కవర్ చేసిన వారికి బంగారు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీవోలు. సేల్స్ ఆఫీసర్లు మంజుల, జరుపుల రాజు, నారాయణస్వామి, రాజేందర్, అన్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గోపాలస్వామి గుడిలో అన్నదానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ గోపాలస్వామి గుడి బస్టాండ్ వద్ద అమావాస్య పురస్కరించుకొని అమావాస్య అన్నదానం కార్యక్రమాన్ని ముకాంబికా సేవ దొడ్డ రమేష్ కుమార్ లావణ్య దంపతులు దాతల సహకారంతో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలస్వామి గుడి అర్చకులు, జ్ఞాన సరస్వతి దేవాలయ అర్చకులు, పలువురు ఆర్యవైశ్యులు దొడ్డ రమేష్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇరుకుల రమేష్, తోనుపునూరి వీరన్నలు మాట్లాడుతూ డబ్బు అందరి దగ్గర ఉంటుంది కానీ, సేవ చేసే గుణం కొందరికి మాత్రమే ఉంటుందని, ఇలా అందరూ సేవాకార్యక్రమాలు నిర్వహించాలని, ఇలా చేస్తే పితృ దేవతల ఆశీస్సులు ఉంటాయని వారు అన్నారు. పాలకుర్తి సంపత్, పాలకుర్తి సతీష్, బెజగం రజనీకాంత్, దివ్యల పూర్ణచందర్, వాసుదేవరావు, సిద్ధిరాల నాగరాజు, పబ్బా ప్రసాద్, కిషోర్, అయితే పూర్ణచందర్, పోలా ధనుంజయ, చకిలం శరత్, దివ్యల శ్రీనివాస్, నాగరాజు, నీలా రాజన్న, వరంగల్ ఎంజీఎం రోడ్ ఆర్యవైశ్య సభ్యులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారెంటీలపై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకు చేరేవిధంగా మనం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని మాజీ ప్రభుత్వ చీఫ్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ భాస్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజలకే చేరేవిధంగా మనం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలన్నారు. దళిత బంధు కూడా ఇచ్చేలాగా కృషి చేయాలని తెలిపారు. పేదల గురించే అలోచించే ప్రభుత్వం కాదు ఇప్పుడు ఉన్న ప్రభుత్వం. ఈ ప్రభుత్వం చిరు వ్యాపారులను ఇబ్బంది పెడుతుందన్నారు. ఇక నుంచి గుడిసె వాసుల జోలికి వెళ్లిన, చిరు వ్యాపారుల జోలికి వస్తే ఖబర్దార్ బిడ్డ ఉరికునే లేదని చెబుతున్నారు. తప్పుడు కేసులు పెట్టి మా కార్యకర్తలను వేధించడం జరుగుతుంది, కార్యకర్తల జోలికి వస్తే ఊరికేనీదే లేదని హెచ్చరించారు. మనకు రాబోయే రోజులలో మనకు మంచి రోజులు వస్తాయ్ ఎవరు ఆధైర్యపడకండని కార్యకర్తలకు సూచించారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ వినయ్ భాస్కర్ అంటే ప్రజల పట్ల వినయం, శ్రతువుల పట్ల లా భాస్కరుడు అని అన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ లేరని విమర్శించారు. మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అన్నారు మంచిదే కానీ దానివల్ల ఆటో నడుపు కునే వాళ్ళ జీవితాలు రోడ్డు మీద పడ్డాయ్, వారి బాగుకోసం ఏమైనా చర్యలు తీసుకున్నారా ఇంతవరకు అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్లు మర్రి యాదవ్ రెడ్డి, సుందర్ రాజు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యాధికారులకు సమ్మె నోటీసు అందజేత




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు రెగ్యులర్ చేయాలన్నారు. 16న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటున్నారని, ఒక్క రోజు సమ్మె చేస్తున్నట్లుగా నాలుగు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు రంగశాయిపేట్ డాక్టర్ భార్గవి, చింతల్ డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ కిరణ్, కీర్తి నగర్ డాక్టర్ అర్చనలకు సమ్మె వినతి పత్రాన్ని ఎన్ హెచ్ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా సమ్మె నోటీసు అందజేశారు. ఎన్ హెచ్ఎం కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్ హెచ్ఎం స్కీమ్ ఉద్యోగులను డాక్టర్స్ ఎలా రెగ్యులర్ చేశారో అదే రీతిలో ఎలాంటి షరతులు లేకుండా మమ్మల్ని కూడా రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెల్త్ కార్డ్స్, ఎన్ హెచ్ఎం ఉద్యోగులకు రెండు నెలల వేతనాలు డిసెంబర్, జనవరి వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎండీ యాకుబ్, ఏఐటీయూసీ జిల్లా సమితి సుమలత, స్టాఫ్ నర్సులు సుమలత, అర్చన, సుష్మ, కళ్యాణి, అర్బన్ హెల్త్ సెంటర్ ఏఎన్ఎంలు విజయలక్ష్ , జయలక్ష్మి, విజయ, శ్రీలత, శారద, పెనీన, ఉప్పలమ్మ, అకౌంటెంట్స్ ప్రేమలత, శ్రీనివాస్ బాబు, మృదుల, ప్రేమలత ఫార్మసిస్టులు సతీష్, సంతోష్, ల్యాబ్ టెక్నీషియన్లు శోభారాణి, లావణ్య, ప్రవీణ, కమ్యూనిటీ ఆర్గనైజర్లు మోహన్ సపోర్టింగ్ స్టాఫ్ రజిత, గౌస్ పాషా, కృష్ణమూర్తి, అజ్మీర విజయ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నపిల్లల కిడ్నాప్లపై అవగాహన



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, ఇతర ప్రాంతాలలో ఇటీవల జరిగిన కొన్ని కిడ్నాప్ సంఘటనలు ఆధారంగా క్యాంబ్రిడ్జ్ మాంటిసోరి గోపాలపూర్ స్కూల్ లో శుక్రవారం విద్యార్థులందరికి కిడ్నాప్లపై అవగాహన ఏర్పడే విధంగా స్కిట్ రూపంలో విద్యార్థులను అప్రమత్తం చేసేలా కార్యక్రమం నిర్వహించారు. అపరిచిత వ్యక్తులతో సంభాషించకూడదని, వారు ఇచ్చిన తినుబండారాలు తీసుకోకూడదని, తల్లిదండ్రులతో తప్ప మరే ఇతర తెలియని వారితో వెళ్లకూడదని పిల్లలకు వివరించారు. తల్లిదండ్రుల సహాయం లేకుండా ఒంటరిగా బయట తిరగకూడదన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను కూడా అప్రమత్తం చేయడం జరిగింది. స్కూల్ నుంచి పిల్లల్ని తీసుకువెళ్లే సమయంలో తల్లిదండ్రులు, గార్డియన్స్ తప్ప ఇతరులకు పిల్లలను తీసుకువచ్చే పనిని అప్పగించకూడదని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపల్ శ్రావణి తాబేటి, ఇంచార్జి రజిని, విద్యార్థులు, స్టాఫ్ పాల్గొన్నారు.

## అసంక్రమిత వ్యాధుల ఆన్ లైన్ నమోదు తప్పనిసరి

### జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** అసంక్రమిత వ్యాధుల ఆన్ లైన్ నమోదును తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష్ పేర్కొన్నారు. శుక్రవారం ఐడీఓసీలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారి డాక్టర్ అంబరీష్, ఎన్ సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎ.నాగేశ్వరావు ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధులకు సంబంధించి ఆన్ లైన్ పోర్టల్లో 30సంవత్సరాలు పైబడిన వారందరి బీపీ, షుగర్, హైపర్ టెన్షన్ వ్యాధులను ఆన్ లైన్ లో ఏ విధంగా నమోదు చేయాలో జిల్లాలో ఉన్న ఏఎన్ఎం, ఎంహెచ్ పీలకు డాక్టర్ సురేష్ డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ అంబరీష్ మాట్లాడుతూ జిల్లాలో అసంక్రమిత వ్యాధులు, ఫాలో అప్ కేసులు ఆన్ లైన్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని ఏఎన్ఎం లను, ఎంహెచ్ పీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఏ నాగేశ్వరరావు, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, డిప్యూటీ డెమో కె.ప్రసాద్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ క్రిష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డ బోయిన శ్రీనివాస్, హెల్త్ ఎడ్యుకేటర్ కేవీ రాజు, పురుషోత్తం, గీత, డీపీఓ రుక్మొద్దిన్, రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఈ నెల 4న ఆదివారం వరంగల్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ అథ్లెటిక్ ఎంపికలను జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించింది. అందులో ఆర్డీఎఫ్ కల్లెడ పాఠశాల విద్యార్థులు 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి ఎంపికలకు ఎంపికయ్యారు. బి.సంజుభార్గవ్ 7వ తరగతి 12 ఏళ్లలోపు 400 మీటర్లలో మొదటి స్థానంలో నిలిచాడు. జి.హర్షిణి 4వ తరగతి 10 ఏళ్లలోపు 300 మీటర్లలో ప్రథమ స్థానం సాధించింది. ఎం.పౌర్ణమి 4వ తరగతికి 10ఏళ్ల లోపు లాంగ్జంప్లో 3వ స్థానం లభించింది. ఈ ముగ్గురు విద్యార్థులు రేపు (ఫిబ్రవరి 10) కొత్తగూడెంలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలం కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్ టీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నడికూడ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఎస్ఎస్సీ విద్యార్థుల అందరికీ పరీక్షా ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు మందల తిరుపతిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ స్కేల్, పెన్సిల్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందరూ బాగా కష్టపడి చదివి మంచి జీపీఏ తెచ్చుకొని జిల్లాలోనే ప్రథమ స్థానంగా నిలవాలని విద్యార్థులతో అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే మంచి నాణ్యమైన గుణాత్మక విద్యా దొరుకుతుందని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే చదివిన వారు ఎందరో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లుగా ఉన్నత స్థాయిలో నిలిచారని కూడా గుర్తు చేశారు. వరంగల్ జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు సాధించడంలో తమ సంఘం ముందు ఉంటుందన్నారు. మరొక ముఖ్య అతిథి హనుమకొండ జిల్లా పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి పలిత శ్రీహరి మాట్లాడుతూ సంఘం ఉపాధ్యాయుల సంక్షేమంతో పాటు, విద్యార్థుల విద్యాభివృద్ధికి కూడా తోడ్పడుతుందని తెలిపారు. అనంతరం సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలోని మహిళా ఉపాధ్యాయులకు నిర్వహించిన ముగ్గుల పోటీలో పాల్గొని విజేతలైన ఉమా, కవిత, పుష్ప, సునీత, రజిత, శ్రీదేవి, కృపమ్మ, మహిళ ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్ రెడ్డి, మండల శాఖ అధ్యక్షుడు అచ్చ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి కట్టుకోజ్వల సతీష్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దొంతుల శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, ప్రకాష్ రావు, నూతి వేణుగోపాలస్వామి, జిల్లా బాధ్యులు జగన్నాథం, బాలాజీ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా మహా చండీయాగం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ నగరంలోని అతి ప్రసిద్ధిగాంచిన రంగనాథ స్వామి దేవాలయంలో శుక్రవారం రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అమావాస్య సందర్భాన్ని పురస్కరించుకొని మహా చండీ యాగాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి శ్రీజ దంపతులు, ప్రధాన కార్యదర్శి చిలుపూర్ సురేష్ రజిని దంపతులు, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఉపాధ్యక్షులు కోలా కవిత, మంచాల సృజన, కూరపాటి రోజా, మౌటంశ్రీనివాస్, వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు వీరాటి ప్రకాష్ రెడ్డి, రావుల ప్రసాద్, గడ్డం భాస్కర్, తదితర భక్తులు పాల్గొన్నారు.



ఉద్యమమే ఆయన శ్వాస.. ప్రత్యేక రాష్ట్ర కాంక్షే ఆఖరి మజిలీగా భావించిన మొండిఘటం.. ఉన్నత విద్య అభ్యసించినా తన ప్రాంతానికి జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని చూసి ఉడికిన యవ్వనం.. తిండికి లేకున్నా తనకు జన్మనిచ్చిన నేలకు స్వేచ్ఛా వాయువులు అందించాలనే పట్టుదల.. అందుకు ఎంతకైనా తెగించే సాహసం.. చిన్న వయసే అయినప్పటికీ తన వంతుగా ఏదైనా చేయాలన్న తపన..లేత ప్రాయమే కానీ ఉద్యమాన్ని ముందుండి నడపడానికి మాత్రం అపారంగా సంపాదించిన పెద్దరికపు అనుభవం.. రాష్ట్రం కోసం తనకు తానుగా అర్పించుకోవడానికి సైతం వెనకాడని యువ నేత.. ప్రత్యేక తెలంగాణలోనూ కార్పొరేటర్‌గా చెరగని ముద్ర.. ప్రజల కోసం తన జీవితాన్ని లెక్కచేయకుండా ఎన్నో కార్యాల్లో కీలకంగా పాల్గొన్న యూత్ ఐకాన్, బీఆర్ఎస్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ **బోడ అన్నయ్ ఉరఫ్ డిన్నా** మరోమారు ప్రజల కోసం కొత్త ప్రయాణాన్ని ఎంచుకున్నారు.

# యూత్ ఐకాన్.. బోడ డిన్నా





**తెలంగాణ ఉద్యమంలో చెరగని ముద్ర వేయడంతోపాటు కేసీఆర్ కు నమ్మిన బంటుగా ప్రత్యేక గుర్తింపు పొందిన తనకు వరంగల్ ఎంపీ సీటు కేటాయిస్తే గెలిచి తీరుతానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఉద్యమ సమయంలో తనను దగ్గరగా చూసిన వ్యక్తులు ఇప్పుడు అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.**

## అవార్డులు..రివార్డులు..

ఎన్నో అవార్డులు సొంతం చేసుకున్న డిన్నా ఎంపీగా అవకాశం కల్పిస్తే బెస్ట్ పార్లమెంటేరియన్ గా కూడా గుర్తింపు తెచ్చుకుంటానంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సేవలతో తనది చెరగని ముద్ర అంటున్నారు. 2015 లో బెస్ట్ యూత్ లీడర్ అవార్డు, 2017 లో జాతీయ స్థాయి అంబేద్కర్ డిస్టింగ్విష్ నేషన్ అవార్డు, 2018 లో సావిత్రిబాయి పూలే అవార్డుతో పాటు ప్రజాహిత జ్యోతిరత్న అవార్డు, 2021లో ఇండియన్ ఎంపైర్ యూనివర్సిటీ హనరరీ డాక్టరేట్ ను డిన్న సొంతం చేసుకున్నారు.

## స్వార్థమెరుగని త్యాగి..

ఆశించి చేయడం స్వార్థమైతే., ఆవిరవుతూ చేయడం త్యాగం. సరిగ్గా బోడ డిన్నాకు కూడా తనకు ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉందని తెలుసు., ఏదో ఓ ఉన్నతమైన ఉద్యోగం వస్తుందనీ తెలుసు. కష్టపడి చదివిన సరస్వతీ కటాక్షం తనను ఏదో ఉన్నతంగా కూర్చోబెడుతుందనీ కూడా తెలుసు. కానీ, డిన్నా కేవలం తన కోసమే కాదని, తన లాగా అన్యాయానికి గురైన తెలంగాణ ప్రాంత బిడ్డల కోసం ఏదైనా చేయాలనే ఒకే ఒక లక్ష్యంతో అప్పటి ఉద్యమ నేత కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు వెంట నడవాలనే కృత నిశ్చయం తీసుకున్నారు. తనకు పరిస్థితులు సహకరించకున్నా, ఆర్థిక స్థితిగతులు ఏ మాత్రం ఆశాజనకంగా లేకున్నా ఆయన మాత్రం వెనక్కి తిరిగి చూసే ప్రయత్నమే చేయకుండా దూసుకెళ్లారు. ప్రత్యేక కాంక్షతో కొత్త ప్రయాణాన్ని మొదలు పెట్టిన కేసీఆర్ ను అనుసరించి ఈ ప్రాంత దౌర్భాగ్యాన్ని పారద్రోలే మహా యత్నంలో తనవంతుగా పాత్ర పోషించాలని అన్నింటిని వదిలి నయా పంథాను ఎంచుకున్నారు.

## కష్టానికి గుర్తింపు..

కష్టమెప్పుడూ వృథాగా పోదు అనడానికి మాజీ కార్పొరేటర్ బోడ డిన్నాయే ఉదాహరణ. సామాన్య కార్యకర్తగా ప్రత్యేక కాంక్ష ఉద్యమంలో ప్రస్థానం ప్రారంభించిన ఆయనకు ఎప్పుడూ కష్టమే గుర్తింపును ఇచ్చింది. సీమాంధ్ర ఏలుబడిలో ఎన్నో అవమానాలకు గురైనా తన పట్టును వీడక, ఎన్ని కేసులు పెట్టినా వెరవని ధైర్యంతో తను సాగించిన ప్రయాణమే ఆయనను ఉద్యమ ముద్దుబిడ్డగా నిలిపింది. అప్పటి ఉద్యమ నేత, తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో ఎన్నో ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొని పోలీసుల హిట్ లిస్ట్ లో నిలిచిన ఆయన ధైర్యం యావత్ తెలంగాణ ప్రజానీకానికి తెలియనిది కాదంటే అతిశయోక్తి కాదు. అర్ధరాత్రుళ్లు, ఒంటరి సమయాల్లో అప్పటి పోలీసు బలగం ఆయనను టార్గెట్ గా చేసుకుని భయాందోళనకు గురిచేయడం, అవసరమైతే ఏదైనా చేస్తామనే హెచ్చరికలు చేసినా ఏ మాత్రం లెక్క చేయక దూసుకెళ్లిన ఉద్యమ దివి బోడ డిన్నా అని ఉద్యమంతో ప్రత్యక్షంగా సంబంధం ఉన్న పలువురు నాయకులు గుర్తు చేసుకుంటున్నారంటే ఆయన స్థాయి ఎంతటితో అర్థం చేసుకోవచ్చు.

## చదువు + విజన్..

ప్రత్యేక కాంక్షతో తన ప్రజోపయోగ యాత్రను ప్రారంభించిన బోడ డిన్నా రాష్ట్రావిర్భావం తర్వాత పలు పనులు చేసి వాటికే వన్నె తెచ్చారు. అట్టడుగు వర్గంలో పుట్టి పెరిగినా ఉన్నతమైన విలువలు ఆకలింపు చేసుకున్న ఆయన ఎప్పటికైనా పేదలకు తనవంతుగా ఏదైనా చేయాలనే ఆతృతతో ముందుకు సాగుతున్న తీరు ఆయనకు రాజకీయంగా మరింత కలిసొచ్చే అంశం. ఈ క్రమంలోనే ఆయన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు కార్పొరేటర్ గా ఎంపికైన తనవంతుగా ఎంతో విస్తృతమైన కర్తవ్యాన్ని నిర్వర్తించి ప్రజలతో శభాష్ అనిపించుకున్నారు. ఉన్నత విద్య ఉన్న ఓ నాయకుడు, అందునా రాజకీయాలకు కొత్తగా వచ్చిన నేత సామాన్య ప్రజలకు ఏం చేయాలో తెలిసిన వాడిగా డివిజన్ ను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. ప్రజలకు దశాబ్దాలుగా, సీమాంధ్ర పాలనలో ఎప్పుడూ ఛీత్కారాలకు, అరకొర వసతులకు కేరాఫ్ గా ఉన్న డివిజన్ వాసులకు తన సంస్కరణలతో మహాద్భుతమైన స్వరాష్ట్ర ఫలాలను అందజేశారు. ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత కేసీఆర్ విజన్ ను ఎంతో చక్కగా గ్రహించి, ప్రజలకు కావాల్సింది, ముఖ్యమంత్రి సమకూర్చడానికి చేస్తున్న ప్రణాళికలను శ్రద్ధగా గ్రహించి తనవంతుగా డివిజన్ ప్రజలకు చేరువ చేసిన చాకచక్యం ప్రదర్శించిన నేర్పరి బోడ డిన్నా. ప్రజావసరాలను ముందే గమనించి, వారికి కావాల్సినవి సమకూర్చడానికి తనదైన పోరాట పంథాను ప్రదర్శించిన నిజమైన నాయకుడు బోడ డిన్నా.

## ఎడ్యుకేట్ ఏ జనరేషన్..

ప్రస్తుత జీవన ప్రమాణాలు చదువుతో ముడిపడి ఉన్న నేపథ్యంలో బోడ డిన్నా కార్పొరేటర్ గా ఉన్నప్పుడే ఎడ్యుకేట్ ఏ జనరేషన్ అనే కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చదువే ప్రతిదానికి మూలం అని ఆయన ఈ కొత్త స్కీం ను పరిచయం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ విద్యా బోధనే లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమం ఎందరో పిల్లలకు కొత్త వెలుగులను ప్రసాదించింది. పార్టీలకు అతీతంగా డిన్నా చేపట్టిన ఈ కార్యక్రమానికి చేయూత నివ్వడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ సోకిన పిల్లలకు, పట్టణ వీధి బాలలకు, హోప్ ఆర్ఫనేజ్ లో ఉన్న పిల్లలకు, ఒంటరి మహిళల పిల్లలకు స్కూల్ నీడ్స్ అందించడం, చేర్పించడం లక్ష్యంగా చేపట్టిన డిన్నా ఈ మంచి కార్యక్రమం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రచారం పొందడమే కాకుండా, మరెన్నో కార్యక్రమాలకు ఊతంగా మారింది.

**చిన్న వయసులోనే ప్రజా సమస్యలపై పట్టు**

**తెలంగాణ ఉద్యమంలో చెరగని ముద్ర**

**కేసీఆర్‌కు నమ్మిన బంటుగా ప్రత్యేక గుర్తింపు**

**వరంగల్ పార్లమెంట్ బరిలో నిలిచేందుకు ఉత్సాహం**

**అవకాశం ఇస్తే గెలిచి తీరుతానంటూ ధీమా**

- గడ్డం కేశవమూర్తి























## బయో డేటా

పేరు : బోడ అన్నయ్ (డిన్నా)
తండ్రి పేరు : బోడ మోహన్
తల్లి పేరు : సక్కుబాయి
పుట్టిన తేదీ : 31-08-1983
విద్యార్హతలు : డిప్లొమా (ఈఈఈ)
కులం : ఎస్సీ బి (మాదిగ)

## రాజకీయ అనుభవం

- 2001 లో తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలక కార్యకర్తగా పార్టీలో చేరి చురుగ్గా పనిచేస్తున్నారు.
- 2001 - 2005 డివిజన్ యూత్ అధ్యక్షుడిగా..
- 2005 - 2007 స్టూడెంట్ యూనియన్ సిటీ ఇంచార్జిగా...
- 2009 నుంచి ప్రస్తుతం.. బీఆర్ఎస్ గ్రేటర్ వరంగల్ యూత్ అధ్యక్షుడిగా...

## ప్రధాన భూమిక పోషించిన సందర్భాలు..

- తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ఉద్యమంలో చేపట్టిన అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.
- 85 కేసులు.. , రైలు రోకో కార్యక్రమంలో 5 కేసులు ...
- స్టేషన్ ఘన్ పూర్ ఉప ఎన్నికల్లో డాక్టర్ తాటికొండ రాజయ్య కు మద్దతుగా పార్టీ అప్పగించి ఒగ్లాపూర్, మగ్దూర్ తండా, చిన్నతండా, పెద్దతండాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.
- పరకాల ఉపఎన్నికల్లో మొలుగూరి భిక్షపతికి మద్దతుగా సంగెం, పల్లార్ గూడ, రేఖ్యాతండా, చిన్నతండాల్లో ప్రచారం.
- గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన క్యాంపెయినర్ గా చర్లపల్లి కేంద్రంలో మేయర్ అభ్యర్థి బొంతు రామ్మోహన్ గెలుపు కోసం కృషి...
- 2009 2010 ఉపఎన్నికలు, 2014, 2018 ఎన్నికల్లో దాస్యం వినయ్ భాస్కర్ గెలుపు కోసం కీలకంగా ప్రచారం..
- 2015 లో వరంగల్ లోక్ సభ ఉపఎన్నికల్లో పసునూరి దయాకర్ గెలుపు కోసం కాజీపేట ఇన్చార్జిగా ప్రచారం..







## గిఫ్ట్ ఏ ప్లాంట్..

భవిష్యత్ తరాలకు పచ్చదనం అందించాలనే ముందు చూపుతో డిన్నా గిఫ్ట్ ఏ ప్లాంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ఎందరిలోనే మార్పులు తీసుకొచ్చారు. ఏ కార్యక్రమం జరిగినా, ఏ కార్యం తలపెట్టిన అనవసర ఖర్చులు తగ్గిస్తూ, పచ్చని మొక్కలు ఇచ్చిపుచ్చుకునే సంస్కృతికి డిన్నా బీజాలు వేశారు. ప్రత్యేక రాష్ట్రంలో చేపట్టిన హరితహారం కార్యక్రమాన్ని కూడా ఆయన ముందుండి విజయవంతంగా కొనసాగేలా చూసుకున్నారు. తన టీంతో పాటు ప్రజలు స్వచ్ఛందంగా మొక్కలు నాటే కార్యంలో పాల్గొనేలా ఆయన మోటీవేషన్ ఇచ్చిన సందర్భాలూ ఎన్నో ఉన్నాయి.

## ప్రజలకు మరింత చేరువ..

మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా ఎన్నో ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు నిత్యం చేరువైనారు. డివిజన్ నే ఓ రాష్ట్రంగా భావించి ఆయన చేసిన సేవా కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోనే ఓ సంచలనంగా చెప్పొచ్చు. ఈ క్రమంలో ఆయన చేపట్టి డివిజన్ డ్రైవ్ బై సైకిల్, డ్రైవ్ ఫర్ బెగ్గర్స్, బస్తీ మిత్ర, ఉద్యోగులకు, ప్రతిభావంతులకు సన్మానం, దసరా, రంజాన్, క్రిస్ట్ మస్ పండుగల వేళ ప్రజలందరినీ ఏకం చేసే కార్యక్రమాలు, అవీ కాకుండా నిరుపేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే దూరదృష్టితో శిబిరాలు నిర్వహించడం, ఇలా చెప్పుకుంటూ పోతే మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా డివిజన్ స్వరూపాన్ని సమూలంగా మార్చడానికి ఎంతో శ్రమించారు. ప్రజలను దగ్గర నుంచి చూసిన అనుభవం, స్వతహాగా తాను కడు బీదరికంలో పుట్టిన వాడు కావడంతో అతిసామాన్యుడికి కావాల్సిన అత్యవసరాలను తీర్చడానికి ఆయన రచించిన వ్యూహరచన నభూతో నభవిష్యత్ గా విమర్శకులు సైతం ప్రశంసిస్తారు.

## కరోనా వేళ..

ప్రపంచాన్ని గడగడలాడించిన మహమ్మారి కరోనా వేళ బీఆర్ ఎస్ నాయకుడు, కార్పొరేటర్ బోడ డిన్నా చూపిన తెగువ ఎంత చెప్పినా తక్కువే. ఆయన నిత్యం ప్రజలకు ధైర్యం చెబుతూ, డివిజన్ లో విస్తృతంగా పర్యటిస్తూ కావాల్సిన అత్యవసరాలను తీర్చే పనినే దినచర్యగా పెట్టుకున్నారు. వలస కూలీలకు కావాల్సిన నిత్యావసరాలు., కడు నిరుపేదలకు పొట్ట గడవడానికి కావాల్సిన సదుపాయాలను కల్పించడానికి డిన్నా శక్తికి మించి శ్రమించారు. తనవంతుగా స్వచ్ఛంద సంస్థలను కలిసి, ప్రభుత్వ యంత్రాంగంతో మాట్లాడి అవసరార్థులకు చేదోడువాదోడుగా నిలిచిన దాతృత్వం ఆయనలో కనిపించింది. డివిజన్ వాసులకు కావాల్సిన సదుపాయాలు కల్పించడానికి ఆయన మేయర్ సహా ఉన్నతోద్యోగులను పరుగులు పెట్టించారంటే ప్రజా సేవలో ఆయన చొరవ ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని అర్హులైన లబ్ధిదారులకు అందించడానికి ఆయన ఎల్లవేళలా కష్టపడ్డారు. ప్రతి గడపకు ప్రభుత్వ ఫలాలు అందేలా ఆయన చూపిన చొరవ, ఆయన లౌక్యంతో తమకు దక్కిన పథకాలను నెమరేసుకుంటూ సంతృప్తి చెందిన ప్రజలే ఆయనను కార్పొరేటర్ గా గెలిపించిన డివిజన్ ప్రజలకు ఆయనిచ్చిన బహుమతిగా చెప్పొచ్చు.

## అవకాశం కోసం..

ప్రజా క్షేత్రంలో సమస్యలు, కష్టాలు, సామాన్యుడి ఇబ్బందులు స్వయంగా చూసిన అనుభవం ఉన్న మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా వరంగల్ లోక్ సభ స్థానం నుంచి బీఆర్ఎస్ పార్టీ నుంచి బరిలో నిలవడానికి ఉత్సాహంగా ఉన్నారు. తనకు ఉద్యమ నేపథ్యం నుంచి ఉన్న గుర్తింపు, తను చేసిన ప్రజోపయోగ కార్యక్రమాలు, ఉద్యమ సమయంలో ఎన్ కౌంటర్ వరకు వెళ్లొచ్చిన చేదు అనుభవాలు, సుమారు వందకు పైగా కేసుల్లో నిత్యం కోర్టుల చుట్టూ తిరిగిన నేపథ్యం తనకు తప్పకుండా టిక్కెట్ దక్కడానికి అవకాశాలుగా ఉంటాయని ఘంటాప్రథంగా భావిస్తున్నారు. ఉద్యమ నేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు క్షేత్రస్థాయిలో ఎవరేంటో తెలుసు కాబట్టి తనలాంటి నిజమైన నాయకుడికి తప్పకుండా అవకాశం కల్పించి ప్రజా సేవలో తరించే అవకాశాలు కల్పిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేస్తున్నారు.



## బల్దియా ఇంచార్జి కమిషనర్‌గా రాధిక గుప్తా

### శుభాకాంక్షలు తెలిపిన ఉద్యోగులు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహా నగరపాలక సంస్థ ఇంచార్జి కమిషనర్ గా హనుమకొండ జిల్లా (స్థానిక సంస్థలు) అదనపు కలెక్టర్ రాధికా గుప్తా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తిగత కారణాలతో సెలవుపై వెళ్ళడంతో హనుమకొండ అదనపు కలెక్టర్ కు అదనపు బాధ్యతలు కేటాయిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బాధ్యతలు చేపట్టిన ఇంచార్జి కమిషనర్ ను గ్రేటర్ అదనపు కమిషనర్లు అనిసుర్ రషీద్, రవీందర్ యాదవ్, పీఆర్ ఓ ఆయుబ్ అలీ, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణా రెడ్డి, హార్టికల్చర్ అధికారి రమేష్ తదితరులు కలిసి పూల మొక్కలు, పుష్ప గుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



# మేడారంలో ప్లాస్టిక్‌పై నిషేదం

### సీఎం ఆధ్వర్యంలో గోడ పత్రిక ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, మేడారం :** లక్షలాదిగా భక్తులు తరలివచ్చే మేడారం మహాజాతరను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. అదే విధంగా ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాలులో అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎస్ శాంతి కుమారి తదితరులతో కలిసి గోడ పత్రిక ఆవిష్కరించారు. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటున్న విషయాన్ని అందరూ గుర్తించాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు అప్రమత్తతతో మెలగాలన్నారు.

## చదువుతోపాటు పరిశోధన వైపు దృష్టి సారించాలి

### వాగ్దేవి వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపతి రావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రతి విద్యార్థి చదువుతోపాటు పరిశోధన వైపు దృష్టి సారించాలని, కాలానుగుణంగా మారుతున్నటువంటి పరిస్థితులను అంచనా వేసుకుంటూ సమాజానికి ఉపయోగపడే అత్యున్నతమైన ప్రాజెక్టులు చేయుటకు శిక్షణ పొందాలని బొల్లి కుంట వాగ్దేవి కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపతి రావు సూచించారు. నగరంలోని బొల్లి కుంట వాగ్దేవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ లో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ ఆఫ్ ఇన్స్టిట్యూట్ ఇండియా వరంగల్ లోకల్ సెంటర్ వారి సహకారంతో నిర్వహించిన మూడు రోజుల వర్క్ షాప్ శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ తిరుపతి రావు మాట్లాడుతూ యూజీసీ, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ మేరకు పరిశోధనతో కూడిన ప్రాజెక్ట్ వర్కులు, ఇంటర్న్‌షిప్‌లు చేయించుటకుగాను దేశవ్యాప్తంగా వివిధ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుని విద్యార్థులకు కోడింగ్, స్మార్ట్ గ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అంశాలపై సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి.పూర్ణచంద్రరావు, తోట రాజేష్, ఐఈఐ వరంగల్ లోకల్ సెంటర్ గౌరవ సెక్రటరీ డాక్టర్ ఏవీ గిరిధర్, సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# కలిసికట్టుగా పనిచేద్దాం..

**మేడారం జాతరను విజయవంతం చేద్దాం**

**మహిళలకు ప్రత్యేక సదుపాయాలు**

**అందుబాటులో 4వేల పారిశుధ్య సిబ్బంది**

**పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**




**వరంగల్ వాయిస్, ములుగు :** ఆసియా ఖండంలోని అతి పెద్దదైన మేడారం జాతరకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1.05 కోట్లు కేటాయించిందని, వీటితో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గురువారం రాత్రి మేడారం జాతరలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం పూజరుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావును అడిగి వివిధ అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అత్యంత వైభవంగా మేడారం సమ్మక్క సారలమ్మ జాతర నిర్వహించేందుకు అన్న చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామనారు. నాలుగు వేల మంది పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేశామన్నారు. జాతరలో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. వీఐపీ, వీవీఐపీల దర్శనంతో సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జాతరకు వచ్చే భక్తులకు వైద్యశాఖ నుంచి 30 ప్రత్యేక హెల్త్ క్యాంపులు, అంబులెన్స్ సౌకర్యా ఏర్పాటు చేశామని, ఆర్టీసీ మహిళ సిబ్బందికి టికెట్ కౌంటర్ల వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు అందుబాటులో ఉంచామన్నారు. మేడారం మహా జాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తున్నట్లు సీతక్క ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరిష్, ఐటీడీఏ పీఓ అంకిత్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) శ్రీజ, డీఎస్పీ రవీందర్, పూజరుల సంఘం అధ్యక్షుడు సిద్ధ బోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ అధికారి రాజేంద్రంతో పాటు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు మరో షాక్..

### పార్టీని వీడే ఆలోచనలో మాజీ మంత్రి ముఖ్య అనుచరుడు

### నమ్మక ద్రోహం చేశారంటూ నిట్టూర్పు





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పాలకుర్తి నియోజకవర్గంలో అడుగుపెట్టిన నాటి నుంచి ఆయనకు కుడి భుజంగా వ్యవహరించిన కాకతీయ యూనివర్శిటీ విద్యార్థి ఉద్యమకారుడు మేడారపు సుధాకర్ బీఆర్ ఎస్ ను వీడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఎర్రబెల్లికి నిరసన సెగలు తగలకుండా ఈ విద్యార్థి నాయకుడి అధ్వర్యంలో 10 మంది వెన్నంటి ఉండేవారు. తెల్లారింది మొదలు రాత్ర పొద్దు పోయేవరకు వీరంతా ఎర్రబెల్లి రక్షణలోనే ఉండేవారు. దీంతో ఈ విద్యార్థి నాయకుడు ఎర్రబెల్లికి ప్రియశిష్యుడిగా మారారు. రెండో సారి కేసీఆర్ ప్రభుత్వంలో మంత్రి అయిన ఎర్రబెల్లి తన అనుచరుడికి రాష్ట స్థాయి చైర్మన్ ఇప్పిస్తానంటూ పలు మార్లు కేసీఆర్ ఫాంహౌస్ కు తీసుకెళ్ళినా ప్రయోజనం చేకూరలేదని సుధాకర్ ఆరోపించారు. యువతలో తనకొస్తున్న క్రేజీని చూసి ఈర్ష పడిన మంత్రి ఏదో ఒక కేసులో ఇరికించేందుకు ప్రయత్నించినట్లు చెప్పుకొచ్చారు. ఈ విషయం తెలుసుకుని ఇలాంటి ప్రయత్నాలు మానుకోవాలంటూ పలు మార్లు తన గురువుకు హెచ్చరికలు జారీ చేసినట్లు వివరించారు. తన వెంట తిరిగిన యువకులకు డబ్బులిచ్చి తీవ్ర ఆరోపణలు చేపిస్తూ మానసికంగా బాధపెట్టాడని నిట్టూర్పు వీడాడు. నోటి మాటగా చేసిన ఆరోపణలతో సీపీ స్థాయిలో రెండు నెలలు విచారణ చేసినా ఏమీ తేలకపోవడంతో ఆరోపణ చేసిన వారిని దాడికి దిగాలంటూ ప్రోత్సహించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రతిష్ట దిగజార్చడంతో పార్టీ మారాలని భావించిన సుధాకర్ పై పాలకుర్తి మండల అధ్యక్షుడి కింద ఉన్న చిల్లర బ్యాచ్ ని గిచ్చి పంచాయితీ పెట్టుకుని కేసుల్లో ఇరికించండి నేను చూసుకుంటా అంటూ బ్లాక్ మెయిల్ చేశాడని ఆరోపించారు. సొంత అన్నతో మంత్రి అనుచరుడికి మధ్య గొడవలు పెట్టించడంతోపాటు రాష్ట్ర స్థాయి చైర్మన్ పదవి ఇప్పిస్తానని ప్రమాణం చేసి మాట తప్పాడని, 17 ఏండ్లు కష్టపడితే ఒక్క లాభం చేయకపోవడం, పాలకుర్తి గుట్ట లడ్డూ ప్రసాద పనులు ఇప్పించి పెద్ద పని ఇచ్చినట్లు బిల్డప్ చేశారని, అనుచరుడి పేరున ఏజెన్సీ పెట్టి ఎర్రబెల్లి తన సొంతం చేసుకోవడం బాధించిందన్నారు. ఎన్నికలకు ముందు ఎర్రబెల్లికి నమ్మినబంటుగా ఉన్న పాలకుర్తి నియోజకవర్గానికి చెందిన లాంబాడ సామాజిక వర్గ యువజన నాయకుడిని టాస్క్ ఫోర్స్ పోలీసులు ఎర్రబెల్లి అదేశాల మేరకు నాలుగు రోజులు అత్యంత్య గోప్యంగా తీసుకెల్లి చిత్రహింసలకు గురిచేస్తే అది తెలిసిన సుధాకర్ ఇలా చేయడం పద్దతి కాదని గొడవ కూడా పెట్టుకున్న విషయం మరువరాదన్నారు. ఇలా తప్పుడు పనులకు పాల్పడుతున్న ఎర్రబెల్లితో ఇక ఉండలేనంటూ బీఆర్ ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు మేడారపు సుధాకర్ సిద్ధపడుతున్నారు.